ప్రయాణం..భయం..భయం

- రక్షణగోడలకే రక్షణ కరువు
- ప్రమాదకరంగా మారిన ఘాట్‌రోడ్డులో మలుపులు
- పట్టించుకోని హైవే అధికారులు
- ఆందోళనలో వాహనచోదకులు



ప్రమాదకరంగా ఉన్న లోయ



ఘాట్‌రోడ్డులో శిథిలమైన రక్షణగోడ

అనంతగిరి: మన్యమంతా కొండలమయం... అక్కడికి చేరాలంటే ఎత్తైన కొండల నడుమ ఘాట్ రోడ్డులో ప్రయాణించాల్సిందే.. ఈ దారిలో ప్రయాణం అంత సులువు కాదు... అడుగడుగునా ప్రమాదకర మలుపులు.. ఏ మాత్రం ఆదమరిచినా ప్రాణానికే ముప్పు తప్పదు.. ఘాట్ రోడ్డు ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాల్సిందే.. ఇక ఘాట్‌రోడ్డులోని రక్షణ గోడలకే రక్షణ కరువైతే ఇక పరిస్థితి ఏమిటి...ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తోందో తెలియని పరిస్థితిలో వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు

మలుపులు..ప్రమాదాలకు పిలుపులు

మండలంలోని ఆంధ్రా కాశ్మీర్‌గా పేరొందిన అరకు లోయకు స్వాగత మార్గమైన అనంతగిరి ప్రకృతి అందాలకు నిలయం..ఇక్కడి నుంచి ఘాట్ రోడ్డు ప్రయాణం ప్రారంభమవుతుంది. శివలింగపురం నుంచి సుంకరమెట్ట వరకు ఘాట్ రోడ్డు ఉంది..

మలుపులతో సాగే ఈ దారంతా ప్రకృతి అందాలతో నిండి ఉంటుంది...అందాల పచ్చని పైరులతో దర్శనమిస్తున్న లోతైన లోయలు ఓ వైపు.. కొండవాలు మరోవైపుతో ప్రయాణం సాగుతోంది.. అయితే ఈ దారిలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ మార్గంలో రక్షణ గొడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అరకు-విశాఖ ప్రధాన రహదారి కావడంతో రోజు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రక్షణగోడలు కూలిపోయి ప్రమాదకరంగా దర్శమిస్తున్నా ఎన్‌హెచ్‌-5 అధికారులు కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం. దీంతో వాహనచోదకులు భయాందోళన నడుమ ప్రయాణాలు సాగిస్తున్నారు. అరకు-విశాఖ ప్రధాన రహదారి మర్ధగుడ సమీపంలోని మలుపువద్ద రక్షణగోడకూలిపోవడంతో ప్రయాణం ప్రమాద భరితంగా మారింది. మలుపు వద్ద సుమారు వంద అడుగులు లోయ ఉండడంతో ప్రయాణాలకు వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు.

పలు ప్రమాదాలు

విశాఖ- అరకు ఘాట్‌రోడ్డులోని అనంతగిరి మండంలోని మర్ధగుడ గ్రామం వద్ద మలుపు వద్ద పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి..ఇక్కడ రక్షణ గోడలు శిథిలావస్థకు చేరడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రాంతం వద్ద జరిగిన కొన్ని ప్రమాదాల వివరాలు.. విజయనగరానికి చెందిన కొంతమంది వ్యాపారులు అరకులోయకు వచ్చి, తిరిగి వెళుతుండగా, మలుపువద్ద ఆటో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోవడంతో ఒకరు మృతి చెందారు. విశాఖపట్నం చెందిన పర్యాటకులు అరకులోయ వచ్చి, తిరిగి వెళ్తుండగా, కారు లోయలోకి దూసుకుపోవడంతో పలువురు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. లారీ లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలోని డ్రైవర్ గాయపడ్డాడు. ఘాట్ రోడ్డులోని రక్షణ గోడ లేని ఈ మలుపు వద్ద పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్‌5 శాఖ అధికారులు స్పందించి, శిథిలావస్థకు చేరుకున్న రక్షణ గోడలు ప్రదేశంలోని నూతన గోడలను నిర్మించి, ప్రమాదాలకు నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులైన ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు మాట్లాడుతూ ఈ ఘాట్ రోడ్డు సమస్యను కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

క్లుప్తంగా

కలెక్టర్ దృష్టికి సమస్యలు



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ తీగల ప్రభ దంపతులు

గంగవరం : పాడేరులో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను శుక్రవారం మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువాతో సన్మానించి, జ్ఞాపికను బహుకరించారు. అనంతంలో మండలంలోని నెలకొన్న పలు సమస్యలను ఆయన వివరించినట్టు మాజీ ఎంపీపీ ఆమె చెప్పారు.

పాస్టర్ల యూనియన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని క్రైస్తవ చర్చిలో శుక్రవారం యునైటెడ్ పాస్టర్ల ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. పాస్టర్ల సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్‌పాల్, జరల్ సెక్రెటరీగా సంజీవ్‌కుమార్ ఎన్నిక కాగా, ట్రెజరర్‌గా సామ్యుల్, జాయింట్ సెక్రెటరీగా ప్రదీప్, గౌరవ అధ్యక్షుడిగా ప్రభుదాష్, కన్వీనర్‌గా బాబురావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సలహాదారులుగా జాన్‌ప్రకాష్, మదన్, సభ్యులుగా బి.జాన్, ఏలీయారాజు, శ్యామలరావు, గురుమూర్తి, దేవానంద్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.

రింతాడలో పారిశుధ్య పనులు



బస్‌షెల్టర్‌ను శుభ్రం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్

గూడెంకొత్తవీధి: గ్రామసభలో ప్రతిపాదించిన విషయంపై తక్షణమే స్పందించి పంచాయతీ కార్యదర్శి తదితరులు స్పందించారు. రింతాడలో పారిశుధ్య పనులు చేయించాలని ఇటీవల జరిగిన గ్రామసభలో తీర్మానం జరిగింది. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో రింతాడలోని పలు వీధులతో పాటు స్థానిక బస్‌షెల్టర్ వద్ద పారిశుధ్య పనులు చేయించారు. బస్‌షెల్టర్ వద్ద చెత్త పేరుకపోయి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఇటీవల గ్రామసభలో కూడా పలువురు ప్రస్తావించారు. దీంతో బస్టాప్‌లో చెత్త, చెదారాలను తొలగించే పనులు చేయించారు. ఉప సర్పంచ్ సోమేష్ పనులను పర్యవేక్షించారు.

రేషన్ పంపిణీ చేయాలని ఆందోళన



రేషన్ సరకుల కోసం ఆందోళన చేస్తున్న బూసిపుట్టు గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలో గల బూసిపుట్టు పంచాయతీలో తుడుమురాయి ,నేరోడుపుట్టు, తోటలమెట్ట, పిట్టగుడ్లు, సరియాపల్లి, గ్రామాల గిరిజనులు రేషన్ సరకులు సక్రమంగా అందడం లేదని శుక్రవారం ఆందోళన చేశారు. రేషన్ సరకులు కొంతమందికి మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ రేషన్ సరకుల కోసం మూడు కిలో మీటర్ల దూరం నుంచి కాలినడకన తుడుమురాయి గ్రామం వరకు ప్రతి నెల రావాల్సిన పరిస్థితి ఉందన్నారు.ఎంతో ప్రయాసాలు పడి వస్తే కొంత మందికి మాత్రమే రేషన్ సరుకులు అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా కార్డుదారులకు పూర్తి స్థాయిలో రేషన్ అందడం లేదని, సేల్స్‌మెన్‌ను అడిగితే వచ్చే నెల అంటూ నెలలు గడిపేస్తూ వస్తున్నారని చెప్పారు. శుక్రవారం 92 మందికి రేషన్ సరుకులు అందలేదని, తక్షణమే అధికారులు స్పందించి ప్రతి నెల సక్రమంగా రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్



జద్దంగిలో ధర్నా చేస్తున్న ఉపాధి వేతనదారులు

రాజవొమ్మంగి: సుమారు రెండు నెలలుగా బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించాలంటూ ఉపాధి వేతనదారులు మండలంలోని జద్దంగి గ్రామంలో శుక్రవారం ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. కుటుంబ ఆర్థిక భారం పెరిగిందని, అటువంటి సమయంలో ఉపాధి వేతనదారులకు రావాల్సిన కూలీ సొమ్ములు చెల్లించడంలో జాప్యం తగదని ఈ ఆందోళనకు సంఘీభావం తెలిపిన స్థానిక ఆదివాసీ సంఘం నాయకులు తెడ్ల రాంబాబు, గిరిజన మహిళ సంఘం నాయకురాలు గూడెం లక్ష్మి చెప్పారు. చేసిన పనికి జీతాల కోసం కారాలయాల చుట్టు కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందన్నారు. ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 10వేల వరకు వేతనాలు రావాల్సి ఉందని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దుర్గ, పార్వతి, లక్ష్మి, కుమారి, చిన్నాలు, మల్లిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సమస్యపై స్థానిక ఉపాధి హామీ ఏపీఎం సురేష్‌కుమార్‌ను వివరణ కోరగా మండలంలో సుమారు 3వేల మంది ఉపాధి హామీ పనులకు వస్తున్నారని, వారికి 9 వారాలకు చెందిన వేతనాలు బకాయి పడిన సంగతి వాస్తవమేనన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే చెల్లింపులు జరుగుతాయన్నారు.

పాఠశాల భవనం మంజూరు చేయండి



పాఠశాల భవనం కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ముఖిపుట్టు గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలో గల కుమడ పంచాయతీ ముఖిపుట్టు గ్రామంలో ఉన్న పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు నారాయణ, సింహాచలం, సుబ్బరావు, రేణుకలు కోరారు. శుక్రవారం పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన చేశారు. పాఠశాలకు భవనం మంజూరు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఎనిమిదేళ్ల క్రితం అధికారులు నేలమట్టం చేశారని, అప్పటి నుంచి స్థానిక విద్యార్థులు చదువుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. పాఠశాల భవన సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీస స్పందన లేదన్నారు. విద్యార్థుల కోసం గ్రామస్తులంతా చందాలు సేకరించి తాత్కాలిక షెడ్డును నిర్మించుకున్నామన్నారు. ప్రస్తుతం ఆ షెడ్డులోనే పిల్లలు చదువుతున్నారని చెప్పారు. అయితే వర్షం పడితే షెడ్డు కారిపోవడంతో విద్యార్థులు చదువుకు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో ఎంఈవో కార్యాలయం వద్ద ముఖిపుట్టు గ్రామస్తులంతా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వృద్ధాశ్రమానికి వితరణ



ఇంటి పైకప్పు రేకులను వితరణగా అందజేస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు: ఏసు నిర్ణయ దేవాలయం ఆధ్వర్యంలో స్థానికంగా నిర్మిస్తున్న వృద్ధాశ్రమానికి జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ రూ.1.60 లక్షలు విలువచేసే సిమెంటు పైకప్పు రేకులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు, అనాథులను అక్కున చేర్చుకొని సేవలు అందిస్తున్న దేవాలయ నిర్వాహకుల సేవాగుణం చాలా గొప్పదన్నారు. దేవాలయ నిర్వాహకురాలు ఎస్తేరు రాణి మాట్లాడుతూ 2022 వరదల్లో వృద్ధాశ్రమం నీట మునగడంతో అప్పటి నుంచి వేరే ప్రాంతంలో ఆశ్రమం ఏర్పాటుచేసి వారికి సేవలు అందిస్తున్నామన్నారు. తమ ఇబ్బందులు తెలుసుకుని జమాల్‌ఖాన్ మానవతా దృక్పథంతో ఆశ్రమ నిర్మాణానికి చేయూతనివ్వడం హర్షణీయమన్నారు. ట్రస్ట్ సభ్యులు షాజహాన్, ఇంతియాజ్, రియాజ్, నటరాజ్, చిన్నారెడ్డి, ఆసిఫ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరుపయోగంగా హౌసింగ్ భవనం



తుప్పల మధ్యలో ఉన్న హౌసింగ్ శాఖ కార్యాలయం

కొయ్యూరు: హౌసింగ్ సిబ్బంది కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలుగా ఆరు సంవత్సరాల కిందట నిర్మించిన భవనం తుప్పలతో నిండిపోయింది. సింగవరంలో అంగన్‌వాడీ కేంద్రానికి ఎదురుగా ఉన్న స్థలంలో హౌసింగ్ శాఖ భవనాన్ని నిర్మించింది. ఇందులో శాఖ రికార్డుల భద్రత, కార్యకలాపాలు చేపట్టేందుకు ఇక్కడ భవనం నిర్వహించారు.అయితే ఈ భవనాన్ని ఆ శాఖాధికారులు ఏనాడు ఉపయోగించలేదు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

కంటి వైద్య శిబిరం రేపు

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న రంపచోడవరంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు స్వామి పరిజ్ఞేయనంద మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో కంటి వైద్య శిబిరం నిరస్తారని తెలిపారు. న్యూరోసర్జన్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ హాజరై వైద్య సేవలు అందిస్తారన్నారు. ఫిట్స్ రోగులు ఉంటే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సేవలకు ప్రాధాన్యం



మండల ఏపీజీఈఏ నూతన కార్యవర్గ సభ్యులు

చింతపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ (ఏపీజీఈఏ) నూతన కార్యవర్గం స్థానిక ఎస్టీవో కార్యాలయంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాలకు సంబంధించిన వివిధ శాఖల ఉద్యోగులు ఈ ఎన్నికకు హజరై నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకోన్నారు. సంఘం అధ్యక్షుడిగా గసాడి పద్మనాభం, కార్యనిర్వాహక కార్యదర్శిగా కిల్లో జ్యోతిబాబు, కోశాధికారిగా సత్యవతి, ఉపాధ్యక్షులుగా చిన్నయ్యపడాల్, దేవి, రామారావు,వెంకటేష్, సంయుక్త కార్యదర్శులుగా అప్పారావు, శర్మ,దేవూరి శశికుమారి, వేణుగోపాల్ ,శివకుమార్ లను ఎన్నుకున్నారు.అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమణ, శంకరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ద్వారా సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజా సేవలకు తొలి ప్రాధాన్యమిస్తామని, అందుబాటులో ఉంటామన్నారు. ఏపీజీఈఏ జిల్లా కోశాధికారి ధనరాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతభత్యాల సమస్యపై వినతి



ఎంఈవో-2 మల్లేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గంగవరం : మండల, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల జీతభత్యాల బిల్లుల సమస్య పరిష్కారానికి మండల విద్యాశాఖాధికారి తగిన చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు యుటీఎఫ్ జిల్లా కోశాధికారి కే.కృష్ణ ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, వెంకటేశ్వర్లు, నాయకులు బొజ్జి దొర, రామకృష్ణారెడ్డి తదితరులు ఎంఈవో-2 టి. మల్లేశ్వరరావుని కలిసి ఉపాధ్యాయ సమస్యలు, జీతభత్యాల బిల్లులు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల జీతభత్యముల బిల్లులు , ఇతర సర్వీస్ బిల్లులు చేసేందుకు పలు అభ్యంతరాలు, ఇబ్బందులు ఉండడంతో ఇకపై , జూలై 2024 సంబంధించిన అన్ని బిల్లులు సంబంధిత విద్యాశాఖ కార్యాలయం ద్వారా బిల్లులు జరిపేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవోను వారు వినతిలో కోరారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



డస్ట్ బిన్‌లను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ సుభాష్‌చంద్ర

ముంచంగిపుట్టు: పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని వైస్ ఎంపీపీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ గడ్డిబంధ గ్రామంలో స్వచ్ఛ సంకల్పన కార్యక్రమంలో భాగంగా ఇంటికి రెండేసి చొప్పున డస్ట్ బిన్‌లను శుక్రవారం వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ సుభాష్‌చంద్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెత్తను సేకరించి పంచాయతీకీ అందించాలని, చెత్తను డ్రైనేజీ ,బహిరంగ ప్రదేశాల్లో పడేయవద్దన్నా రు.అపరిశుభ్రతతో దోమలు పెరిగి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు.అందజేస్తున్న రెండు డస్ట్ బిన్‌లలో తడి, పొడి చెత్తను సేకరించాలని ఆయన ప్రజలను కోరారు. పంచాయతీ కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



తాగునీటి బోరు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, పిల్లలు

చింతూరు: మండలంలోని నారాయణపురం పాఠశాల ఆవరణలో ఉన్న తాగునీటి బోరు మరమ్మతులు చేయించాలంటూ శుక్రవారం గ్రామస్తులు తమ పిల్లలతో కలసి ఆందోళన నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని బోరు పాడైన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. తమ పిల్లలు నీరు తాగేందుకు, మధ్యాహ్న భోజన నిర్వహణకు, గ్రామస్తులకు ఎంతో ఉపయోగపడుతున్న బోరును వెంటనే మరమ్మతులు చేయించాలని వారు కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



రింతాడలో బాలికలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి వినయ్‌కుమార్

అరకులోయ రూరల్: మండలంలో కొత్తభల్లుగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో సుంకరమెట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి ఉపేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 మంది విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు డాక్టర్ ఉపేంద్ర చెప్పారు. సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమతంగా ఉండాలని ఆయన సూచించారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనారోగ్య లక్షణాలుంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కె.పావనికు చర్మవ్యాధి ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం పి.పద్మావతి, డిప్యూటీ వార్డెన్ మోహిని, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

గూడెంకొత్తవీధి: విద్యార్థులు ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గూడెంకొత్తవీధి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రింతాడ గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. మెరుగైన ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీహెచ్‌ఈవో సింహాచలం, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, సచివాలయ ఏఎన్‌ఎం కుమారి, హెచ్‌ఎం పాపాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు నిత్యావసరాలను విక్రయిస్తే చర్యలు



వర్తకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్

వీఆర్ పురం: వరదల సమయంలో నిత్యావసర సరకులను అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం కిరణా ,కూరగాయల వర్తకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూరగాయలు, కిరాణా సరకులు, పెట్రోలు ,డీజిల్, పాలు, చికెన్ వంటి సరుకులను వరదల పేరు చెప్పి అదనపు ధరకు వినియోగదారులకు విక్రయిస్తే అట్టివారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. అనంతరం గ్రామ రెవెన్యూ సిబ్బందితో వరద సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి అడ్డతీగల విద్యార్థిని ఎంపిక



జక్కా వైష్ణవి

అడ్డతీగల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన జక్కా వైష్ణవి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు అడ్డతీగల ఎంఈవో పి.శ్రీనివాసరావు తెలిపారు.అడ్డతీగల మండలం వీరభద్రపురానికి చెందిన వైష్ణవి 2023-2024 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 577 మార్కులు సాధించిందన్నారు. ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా కౌన్సెలింగ్‌లో కృష్ణా జిల్లా నూజివీడు క్యాంపస్‌కి ఎంపిక చేశారన్నారు.

అధిక పోషకాలున్న పశుగ్రాసంతో పాల దిగుబడి



దిబ్బిడిలో రైతులకు గడ్డి పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ఏడీ చిట్టినాయుడు

బుచ్చెయ్యపేట: పాడి పశువులకు పోషకాలున్న పశుగ్రాసాన్ని అందించడం వల్ల అధిక పాల దిగుబడి సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఆయన శుక్రవారం దిబ్బిడిలో రైతులు పెంచుతున్న పశుగ్రాసాలను పరిశీలించారు. సియాద్రి నాయుడు కల్లాల వద్ద పాడి పెంపకం, పశుగ్రాసాలు పెంపకం, అధిక పాల దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు. చాలా మంది రైతులు పశుగ్రాసాలు పెంపకంపై దృష్టిసారించకుండా ఇళ్ల వద్ద, కల్లాల వద్ద కట్టేసి దాణాలు ఉడికించి పెడుతున్నారన్నారు. దాణా వినియోగం వల్ల పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయన్నారు. కొద్దిపాటి పొలంలోనే మేలు రకం రెడ్ నేపియర్, సూపర్ నేపియర్, అలసంద, పిల్లి పెసర, కాకిజొన్న తదితర రకాల పశు గ్రాసాలను సాగు చేసుకోవాలన్నారు. ఒకసారి గడ్డి నాటితే చాలని, కోసే కొద్దీ పుడుతుందన్నారు. నేపియర్ ముచ్చులు, విత్తనాలను రైతులకు అందించారు.

దోమల మందు పిచికారీ వేగవంతం



పెదగూడలో దోమల మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో దోమల మందు పిచికారీ వేగవంతం చేశామని మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నాగేశ్వరరావు అన్నారు.మండలంలో గల పెదగూడ పంచాయితీ కేంద్రంతో పాటు గ్రామాల్లో మలేరియా మందు పిచికారీను శుక్రవారం నిర్వహించారు.ఆయా గ్రామాల్లో గిరిజనులకు మలేరియా జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ప్రతి ఇంట్లో పిచికారీ చేసుకోనే విధంగా అవగాహన కల్పించామన్నారు. కిలగాడ ,లబ్బూరు పీహెచ్‌సీల పరిధిలో ఆగష్టు 15వ తేదీల్లో రెండవ విడత మలేరియా పిచికారీ మడలంలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గిరిజనులంతా పిచికారీ చేసే సిబ్బందికి సహకరించాలని కోరారు.ఈ ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ మహేష్, ఎంపీహెచ్‌పీ రాణి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఉజ్జాపన కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. గోమాతను పూజించారు. పాడేరుకు చెందిన కాంట్రాక్టరు పరిటాల నాగేశ్వరరావు, గంగాభవానీ దంపతుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పర్యవేక్షణలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

దుర్గాలమ్మ శాకాంబరిగా దర్శనం

మాడుగుల రూరల్: ఆషాఢ మాసం పురస్కరించుకుని శుక్రవారం ఎం. కోడూరులో గ్రామదేవత దుర్గాలమ్మను శాకాంబరీ దేవిగా అలంకరించారు. అన్ని రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.